

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పి


ఎస్‌పి బిందుమాధవ్

కాకినాడ: ఎస్‌పిగా జి.బిందుమాధవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూల్ జిల్లా ఎస్‌పిగా విధులు నిర్వర్తించిన ఆయనను ప్రభుత్వం కాకినాడ జిల్లా ఎస్‌పిగా బదిలీ చేసింది. ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉండి శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేస్తానని, అలాగే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో శాంతి భద్రతలను పూర్తిస్థాయిలో అదుపులో ఉంచేందుకు అన్ని చర్యలు చేపడతానని అన్నారు. మహిళల భద్రతకు ప్రత్యేక కార్యాచరణలు రూపొందిస్తామని తెలిపారు. ఎస్‌పికి పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.

మండలి పోరులో నిలిచేదెవరు?

- పట్టభద్రుల స్థానానికి పెరుగుతున్న పోటీ
- పిడిఎఫ్ అభ్యర్థిగా రాఘవులు ఖరారు
- రసవత్తరంగా మారనున్న ఎన్నికలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

శాసనమండలి ఎన్నికల షెడ్యూల్ విడుదల కాబోతుంది. పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ ఖాయంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో పలువురు ఆశావహులు బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సాధారణ ఎన్నికల తర్వాత జరగబోతున్న మండలి పోరులో నిలిచేదెవరు? అన్న దానిపై ఆసక్తి కనిపిస్తుంది. ఇప్పటికే పిడిఎఫ్ తరపున ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెఎసి కన్వీనర్ డి.వి.రాఘవులు పేరు ఖరారైంది. పిడిఎఫ్ తరపున ఆయన పోటీలో నిలుస్తున్నారు. ఆయనతో పాటుగా కూటమి బలపరిచిన టిడిపి నేత పేరాబత్తుల రాజశేఖరం కూడా బరిలో ఉన్నారు. అలాగే కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన మరికొందరు బరిలోకి దిగే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈసారి జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా మారబోతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను గత డిసెంబర్ 30న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి విడుదల చేశారు. మొత్తం 3,15,261 ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4664, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమలో 64,327, తూర్పుగోదావరిలో 63,441 మంది, ఏలూరు జిల్లాలో 42,602, కాకినాడ జిల్లాలో 70,343, పశ్చిమగోదావరి జిల్లాలో 69,884 మంది ఓటర్లున్నారు. ఆరు జిల్లాల్లోనూ 440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మార్చి 29 నాటికి ప్రస్తుత ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పదవి కాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి రెండవ వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉంది. అలాగే మార్చి 2వ వారంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగొచ్చు. మార్చి 29 లోపే మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగిసే అవకాశం ఉంది.

పిడిఎఫ్‌దే హవా...

శాసన మండలి పునరుద్ధరణ తర్వాత తొలిసారిగా 2007లో జరిగిన ఎన్నికల్లో పిడిఎఫ్ తరపున బరిలోకి దిగిన కచ్చా బుల్లివర్ధన్ అనూహ్య విజయం సాధించారు. పట్టభద్రుల స్థానంలో నిలిచిన ఆయన విజయం ఓటర్ల విజ్ఞతకు నిదర్శనంగా అందరూ పేర్కొన్నారు. నిజాయితీగా ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో ప్రజల పక్షాన నిలిచిన ఎంఎల్‌సిగా ఆయన విశిష్ట గుర్తింపు పొందారు. జిల్లాలోని ప్రజా సమస్యలపై, పట్టభద్రుల సమస్యలను శాసనమండలి వేదికగా వినిపించేందుకు ఆయన ప్రయత్నం చేశారు. ఆ తర్వాత 2013లో జరిగిన ఎన్నికల్లో కార్పొరేట్ విద్యాసంస్థల అధినేతగా ఉన్న కె.రవికిరణ్‌వర్మ గెలుపొందారు. అయితే పట్టభద్రుల సమస్యల విషయంలో చొరవ చూపలేకపోయారనే అభిప్రాయం ఆయనపై సర్వత్రా ఏర్పడింది. ఆ తర్వాత 2019లో పట్టభద్రుల స్థానం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రతినిధి అయిన ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) బరిలోకి దిగి భారీ విజయాన్ని సాధించారు. ఆయన మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలుపొందారు. పట్టభద్రులంతా ఆయన వైపు నిలబడడంతో ఐవి గడచిన కాలంలో అనేక ఉద్యమాలు చేశారు. ప్రధానంగా ఉద్యోగ, ఉపాధ్యాయ నిరుద్యోగ సమస్యలపై శాసన మండలిలో గళమెత్తారు. ముఖ్యంగా సిపిఎస్ రద్దు చేయాలని జరిగిన పోరాటాలలో ముందు నిలబడ్డారు. ప్రభుత్వాన్ని నిలదీశారు. సిపిఎస్ రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని నినదించారు. కారుణ్య నియామకాల చేపట్టాలని అనేకసార్లు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఉద్యోగుల హక్కుల కోసం పోరాడారు. అంతేకాకుండా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అనేక సమావేశాల్లో మాట్లాడి వాటి పరిష్కారం దిశగా చొరవ చూపారు. ఈ నేపథ్యంలో రాబోవు పట్టభద్రుల ఎన్నికల పట్ల పలువురు ఆసక్తి చూపుతున్నారు.

40 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో...



తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా దిడ్డి వీరరాఘవులును ప్రకటించారు. పిడిఎఫ్ తరపున బరిలోకి దిగుతున్న ఈయన 40 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. 1984 నుంచి 2024 వరకు టీచరుగా పనిచేశారు. 35 ఏళ్ల పాటు ఉపాధ్యాయ ఉద్యమకారుడుగా పనిచేశారు. పదేళ్లపాటు మండల కార్యదర్శిగా, 12 సంవత్సరాలు ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, ఐదేళ్లు అధ్యక్షునిగా, రెండు సంవత్సరాలు రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గా, మరో రెండేళ్లు రాష్ట్ర కార్యదర్శిగా, మూడేళ్ల పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ గా పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఆయన ఉమ్మడి జిల్లా జేఏసీ కన్వీనర్ గా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపక సంఘాల మద్దతు దండిగా ఉండడంతో ఆయన గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

కార్పొరేట్ ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎస్‌ఎఫ్‌ఐ ధర్నాలో నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - తుని

కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం స్థానిక డిగ్రీ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, మండల అధ్యక్షుడు జోసెఫ్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధిక మొత్తంలో ఫీజుల దోపిడీ చేస్తూ...విద్యార్థుల ప్రాణాలను హరిస్తున్నాయని అన్నారు. విద్యార్థుల ప్రాణాల కన్నా ఫీజులు మాత్రమే ముఖ్యం అన్నట్లు యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించకపోతే తరగతులకు అనుమతించబోమని,హాల్ టికెట్స్ ఇవ్వమని విద్యార్థులను బెదిరించడంతో విద్యార్థులు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ ఇటీవల భవనంపైకి ఎక్కి దూకి ఆత్మహత్యకు చేసుకున్నాడని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల ప్రాణాలు కాపాడడంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు లేకుండా పోయిందని మండిపడ్డారు. విద్యార్థి మరణానికి కారణమైన నారాయణ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున విద్యార్థుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్, శివ, భాస్కర్, హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలకు గడువులోగా పరిష్కారం

ప్రజాశక్తి - కాకినాడ

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా అధికారులతో కలిసి ఆయన ప్రలజ నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలన్నారు. తప్పనిసరిగా అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ, పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, ఆక్రమణలు తొలిగింపు, డ్రెయిన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం-364 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, జడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, కెఎస్ఈజెడ్ ఎస్‌డిసి కెవి.రామలక్ష్మి, సిపిఒ పి.త్రినాథ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారుతో మాట్లాడుతున్న జెసి రాహుల్‌మీనా

ఉత్తమ ఉద్యోగికి సత్కారం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

జిల్లా ఉత్తమ ఆరోగ్య విస్తరణ అధికారిగా అవార్డు అందుకున్న గెద్దనాపల్లి విస్తరణ అధికారి కోమటి భాస్కరరావును సోమవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పి.సరిత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజలతో మమేకమై ఎల్లవేళలా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా భాస్కరరావుకు అవార్డు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ సి ప్రధాన వైద్యులు సిహెచ్.జ్యోతి మణిమాల, ఎస్.అభిషేక్, ఆరోగ్య పరిరక్షకుడు ఎస్‌వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.


అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న ఉద్యోగులు

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థికే మద్దతు

ప్రజాశక్తి - కాకినాడ


మాణిక్యం

అధ్యాపక, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు బలపరిచిన ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డి.వి.రాఘవులుకే కాంట్రాక్టు లెక్చరర్స్ 475 అసోసియేషన్ మద్దతుగా నిలుస్తుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాణిక్యం గొర్ల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దశాబ్దాలుగా ఉపాధ్యాయుడిగా సేవలందించి అనేక రకాల సమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు చేసిన వ్యక్తి రాఘవులు అని అన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, నిరుద్యోగులు, సామాజిక సమస్యల పట్ల అవగాహన, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో గొంతెత్తి గట్టిగా మాట్లాడగలిగే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులుకి ఉభయ గోదావరిజిల్లాల పట్టభద్రులు పట్టం కట్టాలని కోరారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో బొర్రా గోపిమూర్తిని గెలిపించినట్టుగానే అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

పట్టు పరిశ్రమకు పూర్వవైభవం

ప్రజాశక్తి - పెద్దాపురం


సదస్సులో మాట్లాడుతున్న పట్టు శాఖ డైరెక్టర్ ప్రియాస్వామి

పట్టు పరిశ్రమకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలు అనేక రకాలుగా ప్రోత్సహకాలు అందిస్తుందని పట్టు శాఖ డైరెక్టర్ ఎస్.ప్రియాస్వామి అన్నారు. సోమవారం స్థానిక భాస్కర్ కాలనీలోని ముప్పన రామారావు చేనేత కమ్యూనిటీ భవనంలో పట్టు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బివిసిఎస్.శర్మ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ సిల్క్ బోర్డు ద్వారా 159 యూనిట్లు దేశవ్యాప్తంగా పని చేస్తున్నాయన్నారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దటంలో చేనేత పరిశ్రమ పాత్రను గుర్తించి ప్రభుత్వాలు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నాయన్నారు. ఈ సహాయ సహకా రాలను చేనేత కార్మికులు, మల్బరీ సాగు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిల్క్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ బివి.గీతారాణి మాట్లాడుతూ ఈ ప్రాంత రైతాంగం, చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధికి పట్టు పరిశ్రమ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో అటు మల్బరీ సాగులోను, ఇటు ప్యూర్ సిల్క్ వస్త్రాల తయారీలోనూ రైతులు, చేనేత కార్మికులు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ విశ్రాంత అధికారి జివి.కృష్ణారావు, ఆప్కో జిల్లా మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ప్రకాష్‌దత్, చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెద్దిరాజు పాల్గొన్నారు.

నగరంలో క్లాప్ వాహనాలు నడిపించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో క్లాప్ వాహనాలను నడిపించేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ నగరంలో 105 క్లాప్ వాహనాల ద్వారా ప్రతి నిత్యం తడిచెత్త పొడిచెత్త సేకరించడం జరుగుతుందన్నారు. గత 20 రోజులుగా సిఎన్‌జి. వాహనాలు 75 నిలిచి పోయాయన్నారు. 34 పెట్రోల్ వాహనాలకు గాను కేవలం 15 మాత్రమే పని చేస్తున్నాయని అన్నారు. తక్షణమే క్లాప్ వాహనాలు అన్నీ పనిచేసే విధంగా, డ్రైవర్స్ ఉద్యోగ భద్రత ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత మూడు నెలలుగా జీతం లేక క్లాప్ వాహన డ్రైవర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బకాయి జీతాలను తక్షణ విడుదల చేయాలని కోరారు. క్లాప్ వాహన డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం నెలకు రూ.24,500 జీతం ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తే క్లాప్ డ్రైవర్లను కార్పొరేషన్ అధికారులే ఆప్కాస్ ద్వారా తీసుకుని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గత సంవత్సర కాలంగా డ్రైవర్స్ జీతాల నుంచి మినహాయించిన పిఎఫ్, ఇఎస్ఐ సంబంధిత శాఖల ఖాతాలకు జమ చేయించాలన్నారు. దీనిపై డిఆర్ఓ వెంకట్రావు స్పందిస్తూ గ్రీవెన్స్‌లో ఉన్న నగర పాలక సంస్థ అధికారులను పిలిచి తక్షణమే బకాయి జీతాలు చెల్లించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్స్ సంఘం సభ్యులు టి.గంగాధర్, అప్పలరాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.


డిఆర్ఒకు సమస్యను వివరిస్తున్న సిఐటియు నాయకుడు వీరబాబు

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి


సదస్సులో మాట్లాడుతున్న ఎంపిడిఒ బుజ్జి

ఆరేళ్లలోపు చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డు లేని పిల్లలకు ప్రత్యేక క్యాంప్‌ల ద్వారా కొత్తగా నమోదు చేయించడం, ఇప్పటికే ఆధార్ కార్డు ఉన్నవారికి ఆధార్ నెంబరును ఆన్‌లైన్ చేయడం, జనన ధ్రువపత్రం లేని వారికి వెంటనే చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగ పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటా : ముదునూరి

ప్రజాశక్తి - శంఖవరం


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ముదునూరి

నియోజవర్గంలో కష్టంలో ఉన్న వారికి అండగా ఉంటానని వైసిపి నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు మండలంలోని పెద్దమల్లాపురం పంచాయతీ శృంగాధార గ్రామంలో కాకర సత్యనారాయణ మనవడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆ కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ తమ ట్రస్ట్ రూపంలో నిరుపేదలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గుండు నాగదేవి, మేకల సుబ్బలక్ష్మి, దిడ్డి సత్యనారాయణ, రామిశెట్టి యేసుబాబు, స్థానికులు కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌ను వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి - కరప


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఎల్ఎ నానాజీ

మండలంలోని తుల్యభాగ డ్రెయిన్‌లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఎంఎల్ఎ పంతం నానాజీ కలెక్టర్‌ను కోరారు. స్థానిక రైతులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కొంగోడు, వేములవాడ, గొర్రిపూడి గ్రామాల రైతులకు ఈ ప్రాజెక్టు ద్వారా నీటి ఎద్దడి ఉండదన్నారు. గతంలో ఈ ప్రాజెక్టు పనులు కొంతవరకు చేసి జాప్యం చేయడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందించి త్వరితగతిని లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు బండారు మురళి, నాయకులు మేడిశెట్టి సుబ్బరాజు గొర్రిపూడి, వేములవాడ గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

మద్యం విక్రయాలు దారుణం

ప్రజాశక్తి - గొల్లప్రోలు




నిరసన వ్యక్తం చేస్తున్న కమిటీ నాయకులు

రాజ్యాంగ దినోత్సవం రోజున నియోజకవర్గంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగించడం దారుణమని, ఇది రాజ్యాంగాన్ని అవమానించడమేనని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక, మద్యం మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయ వనరుగా చూడవద్దని, మద్యం కారణంగా అనేక కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని అన్నారు. మద్యానికి బానిసలై ఆరోగ్యాన్ని, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సంపూర్ణ మద్యపాన నిషేధం వైపు ప్రభుత్వాలు ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్యం మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు వేమగిరి తరుణ్, గుర్రాల ప్రసాద్, కరణం విశ్వనాథం, వేమగిరి రాజేంద్రకుమార్, కె.సింహాచలం, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధు, లోవరాజు, వడ్డీకాసులు. సాల్మన్ రాజు, జెవివి మండల అధ్యక్షులు ఏలేటి నానిబాబు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌కు పల్లవి ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం


పల్లవి

మండలంలోని రాయభూపాలపట్నం జడ్‌పి హైస్కూల్ 6వ తరగతి విద్యార్థి మన్యం పల్లవి జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైందని హెచ్‌ఎం మల్లేశ్వరరావు, పీడీ కామిరెడ్డి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో కలకత్తాలో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ జిమ్నాస్టిక్స్ పోటీ అండర్-14 బాలికల విభాగంలో. పల్లవి పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా పల్లవిని హెచ్‌ఎంతోపాటు, పీడీ, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు అభినందించారు.

కార్టూన్ 'నిజం'



వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి - కోటనందూరు


సభలో మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని మాలమహానాడు అధ్యక్షులు, సుప్రీం కోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని అల్లిపూడిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత మాలమహానాడు జాతీయ అధ్యక్షులు విఎల్.రాజుతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు, రాజ్యాంగం స్ఫూర్తికి వ్యతిరేకంగా దళితుల మధ్య చిచ్చుపెట్టేలా వర్గీకరణకు కుట్రలు సాగుతున్నాయని అన్నారు. దళితులను ఆర్థికంగా, రాజకీయంగా అణిచివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు, అగ్రకుల దోపిడీ, మనువాద రాజకీయ పార్టీలు పూనుకున్నాయని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్‌లను రద్దు చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. వర్గీకరణ జరిగితే ఎస్‌సిలోని 59 కులాలకు నష్టం జరుగుతుందని, ముఖ్యంగా మాలల భవిష్యత్ అంధకారంగా మారనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్గీకరణకు అనుకూలంగా ఏక సభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చే నివేదికను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించకపోతే మాలలకు బానిసత్వం తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మీలా గోపి, దాసరి రామచంద్రరావు, కోటనందూరు మండల శాఖ అధ్యక్షులు దుర్తిర్తి సతీష్, మండల కన్వీనర్ యాదగిరి నానాజీ, అల్లిపూడి గ్రామ అధ్యక్షులు నెమ్మది.పెదబాబులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రతి సోమవారం దాతల సాయంతో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చాలని టిడిపి నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ స్ఫూర్తితో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ జగ్గంపేటలో 3 సంవత్సరాలుగా దాతల సాయంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం జగ్గంపేటలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసే వరకు దాతల సహకారంతో కొనసాగిస్తామన్నారు. గోకవరం మండల టిడిపి కమిటీ సాయంతో సోమవారం అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, జాస్తి వసంత్, గడ్డం కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు

ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నియోజకవర్గ టిడిపి కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫారం సదస్సులో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు తీవ్రంగా కృషి చేశారని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటే భయపడే పరిస్థితి ఉండేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పెట్టుబడులు పెట్టేందుకు పెట్టుబడిదారులు క్యూ కట్టేందుకు సమాయత్తం అవుతున్నారని అన్నారు. సిఎం చంద్రబాబుపై ఉన్న నమ్మకమే దీనికి ప్రధాన కారణమన్నారు.

సర్పంచ్ రామకృష్ణకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పెద్దాపురం


సర్పంచ్‌కి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొని సోమవారం స్వగ్రామం తిరిగి వచ్చిన మండలంలోని మర్లావ సర్పంచ్ తోట రామకృష్ణకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామకృష్ణను సాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కారెపు గాంధీరావు, చిన్న, పెద్ది గణపతి, గుంచాల పండు, ఖాతా బుజ్జి, మేడిపోయిన శ్రీను, పసిగొడుగులు సాంబ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మెడికల్ షాపులో రూ.2 లక్షల చోరీ

ప్రజాశక్తి - కడియం

మండలంలోని జేగురుపాడు గ్రామ పంచాయతీ కాంప్లెక్స్‌లో ఉన్న సతీష్ మెడికల్ అండ్ జనరల్ షాపు తాళాలు పగలగొట్టి రూ.2 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని దుళ్ల గ్రామానికి చెందిన గుంటూరి సతీష్ జేగురుపాడులో కొన్నేళ్లుగా మెడికల్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఒక వ్యక్తికి రూ.2లక్షల నగదు ఇవ్వాల్సి ఉండటంతో ఆ మొత్తాన్ని షాపులోనే ఉంచాడు. రాత్రి షాపు కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు వచ్చి చూసేసరికి షాపు తాళాలు పగలు గొట్టి ఉండటాన్ని గమనించాడు. వెంటనే లోపలికి వెళ్లి చూడగా రూ.2లక్షలు మాయమవ్వటాన్ని గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కడియం క్రైం హెడ్ కానిస్టేబుల్ ఎం.సురేష్ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని సోమవారం పరిశీలించింది. దగ్గరలోని ఆ మొబైల్ షాపులోనూ చోరీకి విఫలయత్నం చేసినట్లు గుర్తించారు. సమీపంలోని ఒక పశువుల షెడ్డు వద్ద ఉన్న సిసి కెమెరాలను సైతం దుండగులు పగులగొట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసును నమోదు చేశారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి - కోటనందూరు

వేర్వేరు కేసుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సిఐ జి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. గత శుక్రవారం బిళ్లనందూరు గ్రామానికి చెందిన మాతిరెడ్డి గంగమ్మ ఉపాధి కూలీ పనికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి ఇంటి తలుపులు పగలకొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూస్తే బీరువా పగిలిపోయి ఉంది. బీరువాలో దాచిన 100 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా సోమవారం తాటిపాక సెంటర్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అదే గ్రామానికి చెందిన బొత్స వీరబాబు వద్ద బంగారు ఆభరణాలు లభించాయి. అదే గ్రామంలో ఇద్దరు అన్నదమ్ములు మిరియాల నాగు, మిరియాల నానాజీ మధ్య జరిగిన చిన్నపాటి వివాదంలో జరిగింది. దీంతో తమ్ముడు నానాజీని కర్రతో దాడి చేశాడు. ఈ కేసులో మిరియాల నాగును అరెస్టు చేసినట్లు వారు తెలిపారు.



బహుమతులు అందుకుంటున్న కళాకారులు

ఉత్తమ ప్రదర్శనగా 'స్వేచ్ఛ'

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లిలో స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 3 రోజులపాటు నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీల్లో విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ ప్రదర్శించిన 'స్వేచ్ఛ' ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఈ నాటికను పిఎస్ నారాయణ రచించగా బిఎం. రెడ్డి దర్శకత్వం వహించారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా మిత్ర క్రియేషన్స్ ప్రదర్శించిన 'ఇది రహదారి కాదు' నాటిక ఎంపికైంది. ఈనాటికను ఆకురాతి భాస్కరరావు రచించగా ఎస్ఎం.భాషా దర్శకత్వం వహించారు. తృతీయ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు ప్రదర్శించిన 'చిగురు మేఘం' ఎంపికయింది. ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచించగా ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. అలాగే ఉత్తమ నటుడుగా 'స్వేచ్ఛ' నాటికలో ఆనంద్ పాత్రధారి డాక్టర్ వెంకట్ గోకాడ, ఉత్తమ నటిగా 'రాత' నాటికలో స్వప్నిక పాత్రధారి వాగ్దేవి, ఉత్తమ రచనగా 'ఇది రహదారి కాదు' నాటిక రచయిత ఆకురాతి భాస్కర్ కు, ఉత్తమ దర్శకత్వం 'స్వేచ్ఛ' నాటిక దర్శకుడు ఫణి, ఉత్తమ ఆహ్యార్యం పి.కేశవ, ఉత్తమ సంగీతం సురభి నాగరాజుకు లభించాయి. ప్రేక్షకుల అర్షద్వానాల మధ్య విజేతలందరికీ బహుమతులు అందజేసి అభినందించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పశుసంవర్ధక శాఖ అందిస్తున్న రాయితీ పథకాలను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ సూర్య ప్రకాశరావు అన్నారు. సోమవారం మండలంలోని పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని ఎంపిపి రాయుడు సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ లైఫ్ స్టాక్ మిషన్ కార్యక్రమంలో 50 శాతం రాయితీతో రూ.50 లక్షల వరకు గొర్రెలు, మేకలు పెంపకానికి అవకాశం ఉందన్నారు. జెర్సీ, ముర్రా, సాహివాల్ జాతులకు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నట్లు పశువైద్యాధికారి డి.సుధ తెలిపారు. ఈ సందర్భంగా లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ బ్రహ్మావేద, సర్పంచ్ పంపన రామకృష్ణ, జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్న జనార్ధనరావు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మదర్ థెరిసా కాలనీలో ఏలేశ్వరం మినిస్ట్రీస్ పాస్టర్ జాన్ పీటర్ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ వరుపుల తమ్మయ్యబాబు పాల్గొని పేదలకు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు జాన్‌పీటర్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, గౌరవాధ్యక్షులు కటారి శ్రీను, టిడిపి పట్టణ కార్యదర్శి తూతిక రాజు, కూటమి నాయకులు నూనె రామారావు, వంగలపూడి సతీష్, బెందులూరి స్వామి, సత్య, మినిస్ట్రీస్ సభ్యులు తేజ పాల్గొన్నారు.

యానాం వార్తలు



మురళీమోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మికులు

కార్మిక నేత మురళీమోహన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

స్థానిక రీజెన్సీ కార్మిక యూనియన్ నేత మచ్చా మురళీమోహన్ 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఫ్యాక్టరీ గేటు వద్ద కార్మికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు బి.సూర్యభగవాన్, ఎవివి. సత్యనారాయణ, సాంబశివరావు, గుదే దుర్గాప్రసాద్ మాట్లాడారు. 2012 జనవరి 27న మురళీమోహన్ మృతి చెందారని, నేటి వరకు ప్రభుత్వం ఆ కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రీజెన్సీ తెరిపించడానికి నియోజకవర్గ రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. రీజెన్సీ యాజమాన్యం కార్మికులకు కేటాయించిన స్థలాలను అందజేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్ సతీమణి దుర్గ, వారి కుటుంబ సభ్యులతోపాటు, ప్రసాద్‌రాజు, వర్మ, రామేశ్వరరావు, మురళీమోహన్, దుర్గయ్, కార్మకులు పాల్గొన్నారు.



అన్నదానం చస్తున్న రీజెన్సీ సిబ్బంది

చంద్రశేఖర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

రీజెన్సీ సిరామిక్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్, రీజెన్సీ విద్యాసంస్థల వైస్ ఛైర్మెన్ కెసి.చంద్రశేఖర్‌కు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం చంద్రశేఖర్ 13వ వర్ధంతి స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు మాట్లాడారు. అలాగే ఓల్డ్ ఏజ్ హోంలో ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రీజెన్సీ స్కూల్ హెచ్‌ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాద్‌రావు, ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్, చింతా వెంకట్, చింతా కొండలరావు, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్, ప్రసాద్, సిహెచ్ వీరభద్రరావు పాల్గొన్నారు.



పూజలో ఎస్‌పి బిందుమాధవ్ దంపతులు

ఎస్‌పి దంపతుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించేందుకు ముందుగా ఎస్‌పి బిందుమాధవ్ దంపతులు స్థానిక భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం దేవాలయానికి వచ్చిన వారికి ఆలయ ఇఒ బల్ల నీలకంఠం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నంది మండలంలో ఎస్‌పి దంపతులకు పండితులు వేద స్వస్తి పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి డి.శ్రీహరిరాజు, సిఐ కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిశారు.



భూమి పూజ చేస్తున్న ఎంపిపి సునీత

ఉపాధ్యాయులకు సౌకర్యాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయ ప్రాంగణంలో రూ.2 లక్షలతో నిర్మించే మరుగుదొడ్ల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాశాఖ కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మండల పరిషత్ నిధులతో మరుగుదొడ్ల నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సత్యనారాయణ, ఎంఇఒలు మంగాయమ్మ, మోకా ఉమా, నాయకులు రాయుడు గంగాధర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సత్తెమ్మ జాతర ముగింపు సందర్భంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ తుమ్మలబాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, టిడిపి పట్టణ కార్యదర్శి తూతికి రాజు, బొడ్డు ఉదయశంకర్ పాల్గొని భోజనాలు వడ్డించారు. అలాగే మండలంలోని జి రాగంపేటలోని బసవేశ్వర స్వామి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో జలదాని సుబ్రహ్మణ్యం, గాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్య, వైద్యం, కులవృత్తి అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాకినాడ

వెనుకబడిన అఖిల గాండ్ల తెలికుల కులస్తులను విద్యా, వైద్య, వృత్తిపరంగా అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నరవ అనంతం అన్నారు. అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గొట్టుపల్లి కనకదుర్గ శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం కాకినాడ కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కళ్యాణమండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. త్వరలో నెల్లూరులో రాష్ట్ర సంఘం ఏర్పాటు చేయనున్న మహిళా సంఘంలో ప్రతి జిల్లా నుంచి ఆరుగురిని ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కులస్తులందరూ ఐక్యంగా ఒక మాటపై నిలబడి సామాజిక



సాయిబాబాను సత్కరిస్తున్న జిల్లా కార్యవర్గం సభ్యులు

ఆర్థిక రాజకీయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నరవ అనంతంను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నుంచి ఎన్నికైన జోన్-1 ఉపాధ్యక్షులు కెల్లా ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నరవ భాస్కర వెంకటరమణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పారేపల్లి రామకృష్ణ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గండేపల్లి లచ్చరావు, జిల్లా యువజన కమిటీ కన్వీనర్ పెబ్బులి ఈశ్వరరావు, రెబెల్‌స్టార్ కృష్ణంరాజు ప్రతిభ పురస్కార అవార్డు గ్రహీత పేరూరి కల్కి కామేశ్వరరావులను సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సింగవరపు సాయిబాబు, నాయకులు మురపాక వీరభద్ర రావు, జామి సాయిబాబా, కెల్ల వెంకట ప్రసాద్, అంబటి ప్రేమకుమార్, అంబటి సుబ్రహ్మణ్యం, అలమండ ప్రసాద్, ముద్దుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గ్రోసు గోపాలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి

ప్రజాశక్తి - కోటనందూరు

కోటనందూరు ప్రజా వైద్యశాలను 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తానని ఎంఎల్ఎ యనమల దివ్య అన్నారు. సోమవారం కోటనందూరులో పశువుల గోసాలను, ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ను భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం అనేకమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, గతంలో ఎన్నడూ లేనంత విధంగా రైతులకు రాయితీ రూపంలో



హెల్త్ బ్లాక్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దివ్య

వ్యవసాయ యంత్రాలతోపాటు, పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రైతులకు మేలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గాడి రాజబాబు, అంకమ్మరెడ్డి రమేష్, అంకపరెడ్డి బుల్లిబాబు, శ్రీను, షేక్ నవాజ్ జానీ, పెనుముచ్చు నాగేశ్వరరావు, డి.చిరంజీవరాజు, తదితరులు పాల్గొన్నారు.

సలాది కుటుంబానికి కన్నబాబు పరామర్శ

ప్రజాశక్తి - కరప

కరప గ్రామానికి చెందిన సలాది వెంకన్న కుటుంబాన్ని మాజీ మంత్రి కురసాల కన్నబాబు సోమవారం పరామర్శించారు. ఇటీవల వెంకన్న అల్లుడు సిద్ధి లలితశశాంక్ మతి చెందాడు. వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శలో చింత ఈశ్వరరావు, చింత బుజ్జి, నక్క సత్తిబాబు, గొర్రెల వెంకన్న, చోడపునీడి వెంకటరమణ, ముద్రగడ వీరబాబు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు క్రీమ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో 80 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. శిక్షణ పూర్తి చేసిన తాళ్లరేవు, జార్జిపేట, మెట్టకుర్రు ప్రాంతాలకు చెందిన 80 మంది యువతులు, మహిళలకు క్రీమ్ సేవా సంస్థ ఆవరణలో సోమవారం ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌సిపిటి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు వెంకట నాగ దుర్గాదేవి పాల్గొన్నారు.

ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావు పేటలోని ఎసిటి సైన్స్ సెంటర్‌లో సోమవారం స్థానిక చాచా విద్యా నికేతన్ 6, 7 తరగతుల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆహార పదార్థాలు, మొక్కలలో పోషణ, జంతువులలో పోషణ, ఉష్ణం పాఠ్యాంశాలలోని అనేక ప్రయోగాలను విద్యార్థులతో చేయించారు.

కోతుల బెడదను నివారించేందుకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని 37వ డివిజన్‌లో కోతుల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం కచేరిపేట శాఖ ఆధ్వర్యంలో నాయకులు పిజిఆర్ఎస్‌లో కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకట్రావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ 37వ డివిజన్‌లో కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నగర పాలక సంస్థ పాలకవర్గం ఉన్న సమయంలో కోతుల నివారణకు చర్యలు తీసుకునే పరిస్థితి



డిఆర్ఒకు సమస్యను వివరిస్తున్న నాయకులు

ఉండేదన్నారు. దీనిపై డిఆర్ఒ స్పందిస్తూ కోతు లను పట్టి ఏజెన్సీ ప్రాంతానికి తరలించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో సిపిఎం కచేరిపట శాఖ కార్యదర్శి కె.నాగ జ్యోతి, సభ్యులు భూలక్ష్మి, గౌరి, పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

ప్రజాశక్తి - జగ్గంపేట, పెద్దాపురం

జగ్గంపేటలో ఎలక్ట్రీషియన్ డే వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. రావులమ్మ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పేకేటి వెంకటరమణ, తాతారావు ఆధ్వర్యంలో స్థానిక రావులమ్మ తల్లి ఆలయం వద్ద నుంచి జగ్గంపేట మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. బల్బును కనుగొని వెలిగించిన శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిషన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనియన్ సభ్యులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. పెద్దాపురంలో యాసలపు సూర్యారావు భవనంలో ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంఘ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ అధ్యక్షతన ఎలక్ట్రికల్ డే సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయ అధికారి రవికుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘ అధ్యక్షుడు తాడిశెట్టి గంగ సంఘ అభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపుగా పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్, గడిగట్ట సత్తిబాబు, పాండవ గిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నూతనోత్సాహాన్ని నింపిన లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి - పిఠాపురం

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర టిడిపి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎస్.వర్మ అన్నారు. లోకేష్ పాదయాత్ర చేపట్టి రెండేళ్లు పూర్తియిన సందర్భంగా సోమవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నుంచి పాదగయ జంక్షన్ వరకు వర్మ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో 5 కోట్లమంది ఆశలు, ఆశయాలను ప్రతిబింబిస్తూ కుప్పం నుంచి 2023 జనవరి 27వతేదీన పాదయాత్రగా ప్రజల్లోకి వెళ్లిన యువనేత నారా లోకేష్ యువగళంతో రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్నే మార్చేశారన్నారు. 226 రోజులపాటు 3132 కి.మీ.ల మేర యువగళం పాదయాత్ర సాగిందని గుర్తు చేశారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించి, ప్రజాప్రభుత్వాన్ని స్థాపించడంలో యువగళం కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

చేపల మార్కెట్ సమస్యలు పరిష్కారం చేయాలని ఎపి మత్స్యకారుల, మత్స్య కార్మికుల సంఘం కోరింది. సోమవారం స్థానిక నగరపాలక సంస్థలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఉప్పాడ సత్యనారాయణ, పి.దుర్గాదేవి, సిహెచ్.రమణి మాట్లాడుతూ స్థానిక రాజాజీ వీధిలో ఉన్న పెద్ద మార్కెట్‌లోని చేపల మార్కెట్‌లో సమస్యలను పరిష్కరించాలన్నారు. కొనుగోలుదారులకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, మార్కెట్ చుట్టూ రక్షణగా ఉండే విధంగా ఇనప మెస్ ఏర్పాటు చేయాలని, దొంగతనాలు జరగకుండా సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు హరమ్మ, టి.దుర్గాదేవి, సత్యవతి, నూకాలమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రాంటు గ్రామంలోని సుమారు 30 ఎకరాల శివారు ఆయకట్టుకు నీరు అందక బీటలు వారడంతో సోమవారం ఆ ప్రాంత రైతులు పంట చేలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు సూరంపూడి శ్రీనివాస్, పిల్లి వీరనాగు విలేకరులతో మాట్లాడారు. రిలయన్స్, ఒఎన్‌జిసి సంస్థల వల్ల ప్రతి ఏడాది మా ప్రాంతానికి సాగునీటి ఎద్దడి వస్తుందని అన్నారు. ఈ సంస్థలు అదనంగా సాగునీటి కేటాయింపులు చేసుకోకుండా రైతాంగానికి వస్తున్న నీటిని పరిశ్రమల అవసరాల కోసం తరలించుకుపోతున్నారని తెలిపారు. ఈ చమురు సంస్థలు పైపులైను నిర్మాణం చేసినప్పటి నుంచి ఈ కష్టాలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు



పొలంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రారంభించి 35 రోజులు గడవకుండానే వరిచేలకు మొక్క దశలోనే బీటలు వారాయని అన్నారు. ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి రైతాంగాన్ని ఆదుకోకపోతే ఈ ఏడాదీ నష్టం తప్పేలా లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో రైతులు బాదం ఏడుకొండలు, కుడుపూడి బాబి, గుత్తుల రామకృష్ణ, మేడిశెట్టి శ్రీనివాస్, పిల్లి శ్రీను, పిల్లి నూకరాజు పాల్గొన్నారు.

27 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకెలో సోమవారం ఐఐఐపి అండ్ టి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో తిరుచ్చిలోని శ్రీ సాయి పవర్ అండ్ ఎక్విప్మెంట్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన క్యాంపెస్ ఇంటర్వ్యూలో 27 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ పూల్ క్యాంపస్ డ్రైవ్‌కు జెఎన్‌టియుకె, డిగ్రీ కళాశాలల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు హాజయ్యారు. మెకానికల్ ఇంజనీరింగ్ నుంచి ఏడుగురు, కెమికల్ ఇంజనీరింగ్ నుంచి 10మంది, కెమిస్ట్రీ నుంచి 9మంది, సేఫ్టీ నుంచి ఒకరు మొత్తం 27 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఐఐఐపి అండ్ టి డైరెక్టర్ ప్రొ బిటి.కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ప్రొవి. రవీంద్రనాథ్, కంపెనీ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ సాయి పవార్, హెచ్‌ఆర్ మేనేజర్ ఎన్.గోపి, తదితరులు పాల్గొన్నారు.